




Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 261 | బుధవారం 11 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## అమెరికా యుద్ధోన్మాదానికి
# 193 మంది చిన్నారులు బలి

### - ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం

టెహరాన్ - సూర్య వాస్తవం



అమెరికా, ఇజ్రాయిల్ సేనల యుద్ధోన్మాదానికి ఇప్పటి వరకూ 193 మంది ఇరాన్ చిన్నారులు బలయ్యారు. వీరిలో ఎనిమిది నెలల వయసున్న బాలిక కూడా వుందని ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి తెలిపారు. అమెరికా దాడిలో 11 మంది ఆరోగ్య కార్యకర్తలు కూడా చనిపోయారు. 52 ఆరోగ్య సేవల యూనిట్లు, 29 వైద్య కేంద్రాలు, 19 అత్యవసర యూనిట్లు, 16 అంబులెన్సులపై దాడి జరిగింది. ఇరాన్‌లోని లోరెస్తన్ రాష్ట్రంలో అమెరికా, ఇజ్రాయిల్ సేనలు జరిపిన - మిగతా 2లో..

# విశ్వసనీయత ఏది?

### - అధికార పార్టీకి అనుకూలంగా, ప్రతిపక్షానికి వ్యతిరేకంగా స్పీకర్ వ్యవహారశైలి
### - ఓం బిర్లాను తొలగించాల్సిందే : ప్రతిపక్షాల డిమాండ్



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం

లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం పై లోక్‌సభలో చర్చ జరిగింది. స్పీకర్ ఓం బిర్లాను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టాయని, ఆయన అధికార పార్టీకి అనుకూలంగా, ప్రతిపక్షానికి వ్యతిరేకంగా ఉన్నారని, ఆయన విశ్వసనీయతను కోల్పోయారని ప్రతిపక్షాలు పేర్కొన్నాయి. అయితే, స్పీకర్‌ను కించపరిచేలా ఉన్న ఈ తీర్మానం అనవసరమైన చర్య అని అధికార పక్షం ఆరోపించింది. మంగళవారం ఉదయం 11 గంటలకు సభ సమావేశమైనప్పుడు, ఎన్నికల కమిషన్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల కమిషన్ - మిగతా 2లో..



# చైనా ఓకే...

- ఎఫ్‌డీఐలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఎఫ్‌డీఐ నిబంధనలలో సడలింపులకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం
- చైనా సహా సరిహద్దు దేశాలకు సడలింపులు
- 2020లో గాల్వాన్ లోయలో ఉద్రిక్తతల అనంతరం కఠిన నిర్ణయాలు తీసుకున్న కేంద్రం

2లో

# 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి



అమరావతి- సూర్య వాస్తవం

ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించు కోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ - మిగతా 2లో..



# నేడు గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా ప్రమాణస్వీకారం

### - బేగంపేట ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికిన సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్- సూర్య వాస్తవం

గవర్నర్‌గా శివ్ ప్రతాప్ శుక్లా బుధవారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్ సింగ్ ప్రమాణం చేయించనున్నారు. ఈ కార్య క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు హాజరు కానున్నారు. నూతన గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఆయనకు రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి డి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు, డీజీపీ శివధర్‌రెడ్డి, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.




### ఫోన్ ట్యాపింగ్ కేసులో...
# ప్రభాకర్ రావుకు రెగ్యులర్ బెయిల్

- దర్యాప్తునకు సహకరించాలి
- కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లొద్దు
- షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు

2లో


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


## అది అసత్య ప్రచారం...
# వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటియం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక



అమరావతి- సూర్య వాస్తవం

వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్ధ మండపం - మిగతా 2లో..



# కవిత అరెస్ట్..

### - హైదరాబాద్‌కు తరలింపు
### - వెలుగుమట్ల భూదాన్ బాధితుల పక్షాన నిరవధిక దీక్షకు ఆటంకం

ఖమ్మం - సూర్య వాస్తవం:

ఖమ్మంలోని అంబేద్కర్ భవన్‌లో వెలుగుమట్ల బాధితులకు మద్దతుగా డీఎస్పీ అధ్యక్షులు విశారదన్ మహరాజ్‌తో కలిసి సోమవారం రాత్రి నుంచి నిరవధిక నిరాహార దీక్ష చేపట్టిన జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను పోలీసులు మంగళవారం ఉదయం అరెస్ట్ చేశారు. కవితతో పాటు - మిగతా 2లో..

# ‘ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్’గా ఏపీ

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# చైనా ఓకే...

**- ఎఫ్‌డీఐలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం**
**- ఎఫ్‌డీఐ నిబంధనలలో సడలింపులకు సిద్ధమైన కేంద్ర ప్రభుత్వం**
**- చైనా సహా సరిహద్దు దేశాలకు సడలింపులు**
**- 2020లో గాల్వాన్ లోయలో ఉద్రిక్తతల అనంతరం కఠిన నిర్ణయాలు తీసుకున్న కేంద్రం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రివర్గం సమావేశమై, చైనాతో సహా మన దేశంతో సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) నిబంధనలలో సడలింపులకు సిద్ధమైనట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. 2020లో గల్వాన్ లోయలో భారత్, చైనా సైనికుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో చైనాతో సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో చైనాకు చెందిన టిక్ టాక్, వియ్ చాట్ వంటి 200 యాప్‌లను భారత ప్రభుత్వం నిషేధించింది. ప్రముఖ చైనా ఎలక్ట్రానిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ నుంచి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలను కూడా కేంద్రం తిరస్కరించింది. చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐలపై నిబంధనలను కఠినతరం చేసింది. సరిహద్దు దేశాల నుంచి వచ్చే పెట్టుబడులపై 2020లో ప్రెస్ నోట్ 3ని విడుదల చేసింది. దీని ప్రకారం ఏ భారత సంస్థలోనైనా సరిహద్దు దేశాల సంస్థలు పెట్టుబడులు పెడితే ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, ఆఫ్ఘనిస్థాన్ వంటి దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి.

# కవిత అరెస్ట్..

(మొదటిపేజీ తరువాయి)

దీక్ష చేస్తున్న వారిని పోలీసులు హైదరాబాద్ తరలించారు. అరెస్టు చేసినా దీక్ష కొనసాగిస్తానని కవిత స్పష్టం చేశారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగే వరకూ దీక్ష సాగిస్తానని అన్నారు. ప్రభుత్వం దిగివచ్చి కూల్చేసిన చోటనే బాధితులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తం 600 మంది పోలీసులు దీక్షా శిబిరాన్ని చుట్టుముట్టి అరెస్టు చేయడాన్ని ఆమె ఖండించారు.

# అది అసత్య ప్రచారం...
# వాటిని నమ్మొద్దు

(మొదటిపేజీ తరువాయి)

రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను” అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

# నేడు, రేపు కలెక్టర్ల సదస్సు

**అమరావతి - సూర్య వాస్తవం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధ, గురువారాల్లో జిల్లాల కలెక్టర్ల సదస్సు సచివాలయంలో జరగనుంది. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, జీఎస్‌డిపి గ్రోత్, స్వర్ణాంధ్ర-2047 విజన్ లక్ష్యాలు, మౌలిక సదుపాయాల కల్పన, శాంతిభద్రతలపై సమగ్రంగా చర్చించనున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు సిసిఎల్ఎ స్వాగత ప్రసంగంతో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ, ఆర్థికశాఖ మంత్రులు, ఉప ముఖ్యమంత్రి ప్రసంగించనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి కీలక ఉపన్యాసం చేసి, వివిధ అంశాలపై సమీక్షించనున్నారు. తొలిరోజు స్వర్ణాంధ్ర-2047లోని 10 సూత్రాల అమల్లో భాగంగా పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, జలభద్రత, వ్యవసాయ రంగంలోని టెక్నాలజీ వంటి అంశాలపై చర్చించనున్నారు. రెండో రోజు ప్రజారోగ్యం, సంక్షేమ పథకాలపై కీలక చర్చ నిర్వహించనున్నారు. సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు, మధ్యాహ్న భోజన పథకం, వేసవిలో తాగునీటి ప్రణాళికపై సమీక్ష ఉంటుంది. రాష్ట్రంలోని శాంతిభద్రతలపై ఎస్పిలతో సమీక్ష నిర్వహించనున్నారు.

# విశ్వసనీయత ఏది?

(మొదటిపేజీ తరువాయి)

విస్తృతంగా ఓట్ల రిగ్గింగ్ కు పాల్పడిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. నిరసనలు తీవ్రమవడంతో, సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైనప్పుడు, స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం చర్చకు తీసుకున్నారు. తీర్మానం తనకు వ్యతిరేకంగా ఉన్నందున ఓం బిర్లా సభను నిర్వహించలేదు. స్పీకర్ లేనప్పుడు, ఆయన నియమించిన ప్యానెల్ సభ్యుల్లో ఒకరైన జగదాంబికా పాల్ సభ కార్యకలాపాలను నిర్వహించారు. అయితే, దీనిలో ఆర్డర్ సమస్య ఉందని ప్రతిపక్షాలు ఎత్తి చూపాయి.

”స్పీకర్ పై అవిశ్వాస తీర్మానాన్ని సభ పరిగణించినప్పుడు, డిప్యూటీ స్పీకర్ సభ కార్యకలాపాలను నియంత్రించాలి. అయితే, లోక్ సభ ఇంకా డిప్యూటీ స్పీకర్ ను నియమించలేదు. ఓం బిర్లాపై తీర్మానం సభలో వచ్చినప్పుడు ఆయన నియమించిన ప్యానెల్ సభ్యులలో ఒకరిని సభ నియంత్రించడం సరైనది కాదు. ఈ పరిస్థితిలో, సభ కార్యకలాపాలను నియంత్రించడానికి మరొక సభ్యుడిని ఎన్నుకోవాలి” అని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. అయితే, స్పీకర్ కుర్చీలో ఉన్న సభ్యుడికి స్పీకర్ అధికారాలు ఉన్నాయని, తీర్మానంపై కార్యకలాపాలను నిర్వహించడానికి జగదాంబికా పాల్ కు ఎటువంటి అడ్డంకులు లేవని అధికార పక్షం ప్రతిస్పందించింది. దీని తరువాత, కనీసం 50 మంది సభ్యులు తీర్మానానికి మద్దతు ఇస్తున్నారో లేదో చూడటానికి తీర్మానాన్ని ఓటింగ్ కు పెట్టారు. అవసరమైన మద్దతు ఉందని నిర్ధారించిన తరువాత, తీర్మానంపై 10 గంటల చర్చ ప్రారంభమైంది.

కీలకమైన చర్చల సమయంలో ప్రతిపక్ష సభ్యులను మాట్లాడటానికి స్పీకర్ అనుమతించరని ప్రతిపక్ష ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడితో సహా ప్రతిపక్ష నేతలు మాట్లాడేటప్పుడు తరచుగా మైక్ ఆపివేస్తున్నారని గౌరవ్ గొగోయ్ విమర్శించారు. టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా స్పీకర్ ప్రతిపక్ష ఎంపీలను మాత్రమే ఎంచుకుని వారిని సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఇంతలో, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పీకర్‌ను సమర్థించడానికి ముందుకు వచ్చారు. రాహుల్ గాంధీ స్పీకర్ కంటే ఉన్నతంగా ఉన్నారా? అని అన్నారు. సభలో మాట్లాడే ముందు సభ్యులు స్పీకర్ అనుమతి తీసుకోవాలని పార్లమెంటరీ నియమాలలో స్పష్టంగా పేర్కొన్నారని, అయితే, మాట్లాడటానికి తనకు ఎవరి అనుమతి అవసరం లేదని రాహుల్ చెబుతున్నారని అన్నారు. ఎవరైనా సభ్యుడు తాను స్పీకర్ కంటే ఉన్నతంగా భావిస్తే, దానికి పరిష్కారం లేదని అన్నారు.

**అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్వాదం**

స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం సందర్భంగా లోక్ సభలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తీవ్ర వాగ్వాదం. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ స్పీకర్ ఓం బిర్లాపై తీర్మానం ప్రవేశపెట్టిన తరువాత, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పదే పదే ఆయన మాట్లాడకుండా అడ్డుకున్నారు. ప్రతిపక్షాలను ఎక్కువగా అంతరాయం కలిగించిన మంత్రిగా కిరణ్ రిజిజు రికార్డు సృష్టించారని గౌరవ్ గొగోయ్ ప్రతిస్పందించారు. ప్రతిపక్షాలను ఎక్కువగా అంతరాయం కలిగించిన మంత్రి రిజిజు అయితే, ప్రస్తుత ప్రతిపక్షం దేశం చూసిన అత్యంత బాధ్యతారహిత ప్రతిపక్షమని అమిత్ షా ఆరోపించారు. కిరణ్ రిజిజు మరోసారి లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై దాడి చేశారు.

రాహుల్ పూర్తిగా బాధ్యతారహితంగా సభలో జోక్యం చేసుకుంటున్నారు. ‘ఇలాంటి ప్రతిపక్ష నేతను నేను ఎప్పుడూ చూడలేదు. సభా కార్యకలాపాల సమయంలో ప్రధానమంత్రిని కౌగిలించుకుని తన సహచరులను చూసి కన్నుగీటే ప్రతిపక్ష నాయకుడు ఎవరైనా ఉన్నారా?’ కిరణ్ రిజిజు అన్నారు. రాహుల్ పై అధికార పార్టీ దాడి తీవ్రతరం కావడంతో, ఆయన సోదరి, వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ తన వాదనను వినిపించారు.

రాహుల్ నిజం మాట్లాడటం వల్ల కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి ఆయనకు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రియాంకను ప్రతిపక్ష నాయకురాలిని చేయడం సముచితమని రిజిజు మళ్ళీ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ‘ఆమె క్రమం తప్పకుండా సభకు వచ్చి విధానాలను గమనిస్తారు. ప్రియాంక ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడి కంటే మెరుగ్గా రాణించే అవకాశం ఉంది’ అని రిజిజు అన్నారు.

# అమెరికా యుద్ధోన్మాదానికి
# 193 మంది చిన్నారులు బలి

(మొదటిపేజీ తరువాయి)

దాడులలో నలుగురు విద్యార్థులు మరణించారు. రాష్ట్రంలో 52 పాఠశాలలు దెబ్బతిన్నాయి. ఇరాన్‌లో నివసిస్తున్న వేలాది మంది ఆఫ్ఘన్లు అమెరికా, ఇజ్రాయిల్ సేనల దాడుల కారణంగా ప్రతి రోజూ సరిహద్దును దాటి స్వదేశానికి చేరుకుంటున్నారని ఐరాస శరణార్థి సంస్థ తెలిపింది. ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతంలో ఉన్న అమెరికా స్థావరంపై దాడి చేసినట్లు ఐఆర్‌జిసి తెలిపింది.

**ట్రంప్ బెదిరింపులపై ఇరాన్ ఆగ్రహం**

హర్మూజ్ జలసంధిలో చమురు నౌకలను ఇరాన్ అడ్డుకున్న పక్షంలో ఆ దేశంపై ఇరవై రెట్లు అధికంగా విరుచుకుపడతామని ట్రంప్ చేసిన హెచ్చరికపై టెహరాన్ స్పందించింది. దాడులు ఇలాగే కొనసాగితే మధ్యప్రాచ్యం నుంచి కనీసం ఒక లీటరు చమురు కూడా సరఫరా కానివ్వబోమని తేల్చి చెప్పింది. ఇరాన్ క్షిపణి కార్యక్రమాన్ని ధ్వంసం చేశామంటూ ట్రంప్ చేస్తున్న వాదనలను ఇరాన్ తిప్పికొట్టింది. అనేక శక్తివంతమైన క్షిపణులను మోహరిస్తున్నామని, టన్నుకుపైగా బరువున్న వార్‌హెడ్లను రంగంలోకి దింపుతున్నామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) తెలిపింది.

**చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావం**

ఇరాన్‌పై యుద్ధం ఇలాగే కొనసాగితే, హోర్మూజ్ జలసంధిలో చమురు నౌకల ప్రయాణం నిలిచిపోతే ప్రపంచ చమురు మార్కెట్లపై తీవ్ర ప్రభావం పడుతుందని సౌదీ అరేబియాకు చెందిన ఆరామ్కో సంస్థ హెచ్చరించింది. ఈ సంస్థ ప్రపంచంలోనే అధిక పరిమాణంలో చమురు ఎగుమతి చేస్తోంది.

**దాడులు పూర్తిస్థాయిలో నిలిపివేస్తే దౌత్యయత్నాలు**

అమెరికాతో చర్చలు జరిపే విషయం తమ ఎజెండాలోనే లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. అవసరమైనంత కాలం తాము కూడా యుద్ధాన్ని కొనసాగిస్తామని చెప్పారు. ఒకపక్క దాడులు జరుపుతూ... మరోపక్క చర్చలా అని ప్రశ్నించారు. కేవలం కాల్పుల విరమణ పాటిస్తే సరిపోదని, దాడులు పూర్తిగా నిలిపివేసి వాటిని పునరావృతం చేయబోమని హామీ ఇస్తేనే దౌత్య యత్నాలకు అంగీకరిస్తామని ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధి స్పష్టం చేశారు.

**ఇరాన్‌పై దాడులకు మా స్థావరాలను ఉపయోగించుకోవద్దు : ఇరాక్**

ఇరాన్‌పై దాడులకు తమ స్థావరాలను ఉపయోగించుకోవద్దని ఇరాక్ ప్రధాని మహమ్మద్ అల్-సుదానీ అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియోకు తేల్చి చెప్పారు. ఇరాన్ వైపు నుంచి క్షిపణులు దూసుకొస్తుండడంతో జెరుసలేంలో సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. టర్కీ గగనతలం పైకి ఇరాన్ రెండోసారి బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడంతో అక్కడి ప్రభుత్వం రక్షణ వ్యవస్థను మోహరించింది. ఇరాన్ నుంచి జరిగిన డ్రోన్, క్షిపణి దాడిని తిప్పికొట్టామని యుఎఇ తెలియజేసింది.

**ఇరాన్ ప్రతిదాడులు...**

ఇజ్రాయిల్‌పై, యుఎఇ, సౌదీ అరేబియా, కువైట్ సహా అమెరికాకు వత్తాసు పలుకుతున్న గల్ఫ్ అరబ్ దేశాలపై ఇరాన్ మంగళవారం కూడా దాడులు జరిపింది. హాఫియాలోని ఇజ్రాయిల్ చమురు-గ్యాస్ రిఫైనరీని, ఇంధన ట్యాంకులను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ డ్రోన్ దాడి జరిపింది. బహ్రెయిన్, సౌదీ అరేబియాలలోని చమురు క్షేత్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై డ్రోన్, క్షిపణి దాడులు జరిగాయని సంబంధిత వర్గాలు తెలిపాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో...
# ప్రభాకర్ రావుకు రెగ్యులర్ బెయిల్

**- దర్యాప్తునకు సహకరించాలి**
**- కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లొద్దు**
**- షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దు**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ 1 గా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత బీఆర్ఎస్ సర్కార్ లో ఎస్ఐబీ కేంద్రంగా ఫోన్ అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు 2023 మార్చి 10న పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ కేసులో ప్రభాకర్ రావును ప్రధాన నిందితుడిగా చేర్చారు. ఈ కేసు తెరపైకి వచ్చిన వెంటనే ప్రభాకర్ రావు అమెరికా వెళ్లిపోయారు. అయితే, ముందస్తు బెయిల్ ఇస్తేనే దేశానికి తిరిగి వస్తానని ప్రభాకర్ రావు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు ముందస్తు బెయిల్ కు నిరాకరించింది. హైకోర్టు తీర్పును గతేడాది మే 9న సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిసన్ పై విచారణ జరిపిన జస్టిస్ నాగరత్న.... ‘తొలుత ప్రభకార్ రావును స్వదేశానికి రానివ్వండి’ అని మధ్యంతర రక్షణ కల్పించారు. ఈ రక్షణతో ప్రభాకర్ రావు స్వదేశానికి తిరిగి వచ్చారు. అనంతరం పలుమార్లు దర్యాప్తుకు సహకరించారు. అయితే... పోలీస్ శాఖ లో సుదీర్ఘంగా పని చేసిన అనుభవం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకోని ప్రభాకర్ రావును కస్టోడియల్ ఇంటరాగేషన్ కు ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ అభ్యర్థన పై గతేడాది డిసెంబర్ 11న ప్రభాకర్ రావు కస్టోడియల్ ఇంటరాగేషన్ కు సుప్రీంకోర్టు అనుమతినిచ్చింది. అనంతరం మరోవారం పొడగిస్తూ డిసెంబర్ 25 న ఆయనను రిలీజ్ చేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో ప్రభాకర్ రావు బెయిల్ పిటిషణ్ మరోసారి మంగళవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఇరువాదనలను పరిగణలోకి తీసుకొన్న ధర్మాసనం తీర్పు వెలువరించింది.

**దర్యాప్తుకు సహకరిస్తున్నాం...**

తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్ర వాదనలు వినిపిస్తూ.. ఈ కేసు విచారణకు అర్హమా కాదా అనే అంశంపై నిర్ణయాన్ని ఇప్పటికిప్పుడు తేల్చకుండా బెయిల్ పిటిషన్ ను పెండింగ్ లో ఉంచాలని అభ్యర్థించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు తీవ్రతను దష్టిలో పెట్టుకుని మధ్యంతర రక్షణనే కొనసాగించాలని కోరారు. ఈ కేసులో రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయొద్దని విన్నవించారు. త్వరలో అదనపు ఛార్జ్ షీట్ కూడా దాఖలు చేయబోతున్నట్లు తెలిపారు. అంతకు ముందు ప్రభాకర్ రావు తరపు సీనియర్ అడ్వొకేట్లు రంజిత్ కుమార్, దామా శేషాద్రినాయుడులు వాదనలు వినిపించారు. ప్రభాకర్ రావు దర్యాప్తుకు అన్ని అన్ని విధాలుగా సహకరించారని కోర్టు దష్టికి తెచ్చారు. కస్టోడియల్ విచారణ సైతం ముగిసిందని తెలిపారు. గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణకు పూర్తిస్థాయిలో ప్రభాకర్ రావు కట్టుబడి ఉన్నారని గుర్తు చేశారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం... ప్రభాకర్ రావుకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఉత్తర్వుల సందర్భంగా ప్రభాకర్ బెయిల్ కు సంబంధించి సిద్దార్థలూథ్ర కోర్టుకు పలు అభ్యర్థనలను చేశారు. వీటిని పరిగణలోకి తీసుకొన్న జస్టిస్ నాగరత్న వాటిని బెయిల్ షరతుల కింద ఉత్తర్వుల్లో పొందుపరిచారు.

**షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుంది..**

ఈ కేసుతో సంబంధం ఉన్న సాక్షులను ప్రభావితం చేయడం, సాక్ష్యాలను తారుమారు చేసేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని కోర్టు స్పష్టం చేసింది. అలాగే కేసు దర్యాప్తుకు, అలాగే ట్రయల్ కోర్టు లో జరిగే విచారణకు సహకరించాలని ఆదేశించింది. నిబంధనల ప్రకారం పాస్ పోర్ట్, ట్రావెల్ రికార్డులను ట్రయల్ కోర్టు కు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ట్రయల్ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని తెలిపింది. ఈ షరతులను ఉల్లంఘిస్తే బెయిల్ తక్షణమే రద్దవుతుందని స్పష్టం చేసింది.

## సంపాదకీయం

# పదేళ్లలో 61 యుద్ధాలు...

### - ముగింపు ఎప్పుడు



భారత ప్రధాని నరేంద్రమోదీ నాలుగేళ్ల క్రితం రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభం కాగానే ఒక ప్రకటన చేశారు. రష్యా, ఉక్రెయిన్ దేశాల ప్రతినిధులతో మాట్లాడి ఇది యుద్ధాల యుగం కాదని తెలిపారు. మోదీ ఈ మాట అన్నప్పటికీ ఆయన అంచనా తప్పింది. 2016 నుంచి 2026 మార్చి వరకు చూసినట్లయితే ప్రపంచ వ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయి. అంతర్జాతీయంగా యుద్ధాలను అధ్యయనం చేసే సంస్థ 78 దేశాలు పదేళ్లలో యుద్ధాలు చేశాయి. ఈ 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయి. ఇందులో ప్రభుత్వాలు ఉన్నాయి. ఉగ్రవాద సంస్థలు ఉన్నాయి. స్వతంత్రం కోసం పోరాడే సంస్థల ఉన్నాయి.2016?2026లో 61 యుద్ధాలు జరిగాయి. ఇందులో ప్రభుత్వాలు, ఉగ్రవాద గుండాలు, విముక్తి సంస్థలు పాల్గొన్నాయి. యూరప్‌లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మ్యాపులు మార్చింది. యూరప్‌లో ఉద్రిక్తత కొనసాగుతోంది. మాజీ రష్యా ప్రాంతం అజర్‌బైజాన్, ఉక్రెయిన్‌లో, గల్ఫ్‌లో 1948 నుంచి అనేక దేశాలు యుద్ధాల్లో ఉన్నాయి. ఆఫ్రికాలో, ఆసియాలో యుద్ధాలు జరిగాయి. ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల యుద్ధాలు, అంతర్గత తిరుగుబాట్లు జరిగాయి. ఉక్రెయిన్ యుద్ధం 2022, ఫిబ్రవరిలో మొదలైంది. 1948లో ముగిసిన రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన అతిపెద్ద యుద్ధం ఇదే. మ్యాపును మార్చే యుద్ధంగా చెప్పవచ్చు. 1990-91లో సోవియన్ యూనియన్ పతనం అయిన తర్వాత యూరప్ జాగ్రఫీ మారింది. ఇప్పుడు రష్యా ఉక్రెయిన్ యుద్ధంలో ఆర్థిక నష్టం, జన నష్టం, సంపద నష్టం విపరీతంగా జరిగింది. ఏళ్ల తరబడి యుద్ధం కొనసాగడమే ఇందుకు కారణం.ఇజ్రాయెల్ 2023 అక్టోబర్‌లో హమాస్‌కు చెందిన ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి అనేక మందిని ఊచకోత కోశారు. దీంతో ఇజ్రాయెల్ గాజాపై దాడిచేసింది. ఇది రెండేళ్లు కొనసాగింది. ఆ తర్వాత లెబనాన్, హెజ్‌బొల్లాపై దాడి చేసింది. ఉగ్రవాద నాయకులను హతమార్చింది. ఇరాన్‌పైన కూడా 2025లో 12 రోజులు దాడి చేసింది. ఇదంతా గల్ఫ్‌లో ఉద్రిక్తలను తెలియ జేస్తుంది. ఇక హూతీ రెబల్స్‌కు వ్యతిరేకంగా సౌదీ అరేబియా, అనుకూలంగా యూఏఈ కొట్టుకుంటున్నాయి. 2016 నుండి 2026 మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా 78 దేశాలు 61 యుద్ధాల్లో పాల్గొన్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.: రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ సంఘర్షణలు ప్రపంచ శాంతికి ముప్పుగా పరిణమించాయి.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నాటో దేశాలకు విస్తరించి, అణ్వస్త్ర దాడులకు దారితీసే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.భారత్ చైనా (డోక్లాం, గల్వాన్) వంటి సరిహద్దు ఉద్రిక్తతలను ఎదుర్కొంటోంది. సాంప్రదాయ ఆయుధాలతో పాటు, సైబర్ దాడులు, సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు (ఖతీనీజూజీణజీనిటజీ) కూడా ఈ యుగంలో భాగమయ్యాయిఇక సిరియా అంతర్యుద్ధం మొదట్లో తర్వాత టర్కీ సహకారంతో యుద్ధం చేస్తోంది. అమెరికా టర్కీ అనుకూల సున్నీ ప్రభుత్వం ఏర్పడేలా చేసింది. ఇజ్రాయెల్ దక్షణ సిరియాపై దాడి చేసింది.ఇక భారత్‌లో 2017లో డోక్లాం, 2020లో గల్వాన్ సంఘటన జరిగాయి. ఇవి పెద్ద యుద్ధాలు కాకపోయినా ఏళ్లపాటు సైన్యం మోహరించాల్సి వచ్చింది. 2025లో ఆపరేషన్ సిందూర్‌తో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం జరిగింది. పాకిస్తాన్ శరణు వేడుకోవడంతో భారత్ ఆపరేషన్ సిందూర్‌ను హోల్డ్‌లో పెట్టింది. 2025లో ఆఫ్గనిస్తాన్, పాకిస్తాన్‌కు యుద్ధం జరిగింది. ఈ ఏడాది కూడా యుద్ధం కొనసాగుతోంది.ఆఫ్రికాలోనూ సూడాన్, సౌత్ సూడాన్, సోమాలియా, ఇథియోపియా, కాంగోలోనూ యుద్ధాలు జరుగుతున్నాయి. నార్త్ కొరియా, సౌత్ కొరియా, కంబోడియా, థాయ్‌లాండ్ మధ్య యుద్ధాలు సాధారణం అయ్యాయి. అజర్‌బైజాన్, ఆర్మేనియా మధ్య యుద్ధం జరిగింది. యుద్ధ రంగంలో తమ ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడే సైనికులు తీవ్రమైన శారీరిక, మానసిక అనుభవాలను ఎదుర్కొంటారు. మరణించిన వారి జీవితం అంతటితో సమసిపోయినా వారి కుటుంబాలకు అది చిరకాల బాధాకారణమౌతుంది. గాయపడినవారు మానసికంగాను, శారీరికంగాను, ఒకోమారు జీవితాంతం, అనేక వైకల్యాలతో బ్రతుకు గడపవలసి వస్తుందిజన నష్టంతో పాటు ఆస్తి నష్టం, ఆర్థిక వ్యవస్థ గందరగోళం, మానసిక వత్తిడులు సామాన్య జనానీకంపై ప్రగాఢమైన ప్రభావం కలిగి ఉంటాయి. నేరము, శిక్ష, ద్వేషం, జాతి వైరం, తెగింపు వంటి భావాలు సమాజాన్ని చాలాకాలం అంటిపెట్టుకొని ఉంటాయి.సమాజం ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. కోలుకోవడానికి సంవత్సరాలు లేదా దశాబ్దాలు పట్టవచ్చును. దేశ వనరులు చాలావరకు ప్రగతి నుండి సైనిక అవసరాలకు కేటాయింపబడవచ్చును.దేశంలో నెలకొన్న సంక్షోభం వల్ల, జనంలో రేకెత్తిన తీవ్ర భావాల వల్ల ప్రజలను రెచ్చ కొట్టే నాయకులు అధికారాన్ని హస్తగతం చేసుకొనే అవకాశం ఎక్కువవుతుంది.అణ్వాయుధాలు, రసాయనిక ఆయుధాలు, మందు పాతరలు వంటి వాటి వినియోగాల వల్ల ఆరోగ్యం, జీవనం అస్తవ్యస్తం కావచ్చును.2022లో యుద్ధం జరిగినప్పుడు అజర్‌బైజాన్ ఆధిపత్యం కనబర్చింది. 2023లో జరిగిన యుద్ధంలో 1.5 లక్షల మంది ఆర్మేనియాకు వెళ్లారు.మొత్తంగా 2016 నుంచి 2026 వరకు 61 యుద్ధాలు జరిగాయి. దీంతో మోదీ చేసిన ప్రకటన తప్పు అనిపిస్తుంది. భారత్ యుద్ధానికి సర్వదా సన్నద్ధంగా ఉంది. అందుకే గల్వాన్‌లో చైనాను, డోక్లాంలో చైనాను నిలువరించింది. మోదీకి ఏమాట చెప్పినా ఒక్కటి వాస్తవం. ప్రపంచంలో శాంతి కావాలంటే శక్తి ఉండాలి శస్త్రం కావాలి.




# ఏపీకి కొత్త సీఎం ప్రచారం...

**విజయవాడ - సూర్య వాస్తవం**



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఊహించడం కష్టమే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో అంతా సాఫీగా సాగుతున్నట్లు కనిపిస్తున్నా, తెరవెనుక జరుగుతున్న సోషల్ మీడియా ప్రచారం మాత్రం పొలిటికల్ సెగలు పుట్టిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరలో ఢిల్లీ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తారని, రాష్ట్ర పగ్గాలను తనయుడు లోకేష్‌కో లేదా మిత్రపక్ష నాయకుడు పవన్ కల్యాణ్‌కో అప్పగిస్తారనే విశ్లేషణలు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వానికి చంద్రబాబు కీలక మద్దతుదారుగా ఉండటంతో, ఆయనకు ఢిల్లీలో సముచిత స్థానం దక్కుతుందనేది కొందరి అంచనా. ఒకవేళ బాబు జాతీయ రాజకీయాలకు షిఫ్ట్ అయితే, రాష్ట్రంలో కొత్త నాయకత్వం అనివార్యమవుతుంది. అయితే, టీడీపీకి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ ఉన్నందున, సహజంగానే చంద్రబాబు తన వారసుడిగా నారా లోకేష్‌ను ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోబెట్టాలని భావిస్తారు. ఇప్పటికే లోకేష్ పరిపాలనలో చురుగ్గా ఉంటూ తనదైన ముద్ర వేస్తుండటం ఈ వాదనకు బలాన్నిస్తోంది.మరోవైపు, పవన్ కల్యాణ్ సీఎం కావాలనే డిమాండ్ ఆయన అభిమానుల నుంచే కాకుండా, ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వంటి వారి వ్యాఖ్యల ద్వారా కూడా చర్చకు వస్తోంది. రాజకీయాల్లో ఏదీ అసాధ్యం కాదు అన్న సూత్రాన్ని నమ్మేవారు పవన్ సీఎం అయ్యే అవకాశాలను కొట్టిపారేయడం లేదు. కూటమి గెలుపులో పవన్ పోషించిన కీలక పాత్రను దృష్టిలో ఉంచుకుని, చంద్రబాబు పెద్దమనసుతో ఆయనకు అవకాశం ఇస్తారా? అన్నది ఒక పెద్ద ప్రశ్న. అయితే, ఇది జరగాలంటే టీడీపీ ఎమ్మెల్యేల మద్దతు, ఆ పార్టీ అంతర్గత అంగీకారం తప్పనిసరి. చంద్రబాబు వంటి అనుభవజ్ఞుడైన నేత రాష్ట్రం నుంచి తప్పుకుంటే కూటమిలో నాయకత్వ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్న అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక , అభివృద్ధి సవాళ్లను ఎదుర్కోవాలంటే బాబు అనుభవం అత్యవసరం. కేవలం వారసత్వం కోసమో లేదా మిత్రపక్షాల కోసమో సీఎం పదవిని వదులుకోవడం అంత సులభమైన నిర్ణయం కాకపోవచ్చు. లోకేష్, పవన్ మధ్య అధికార పంపిణీ విషయంలో ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి భవిష్యత్తును ప్రభావితం చేయవచ్చు.అసలు కూటమి పార్టీల మధ్య ఈ విషయంపై అధికారికంగా ఎలాంటి చర్చ జరగకపోయినా, ప్రతిపక్షాల విమర్శలు, సోషల్ మీడియా విశ్లేషణలు ప్రజల్లో అయోమయాన్ని కలిగిస్తున్నాయి. బాబు ఢిల్లీకి వెళ్తారా? లోకేష్‌కి పట్టాభిషేకం చేస్తారా? లేక పవన్‌ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టి కింగ్ మేకర్‌గా నిలుస్తారా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఈ సీఎం కుర్చీ వార్తలు మాత్రం ఏపీ రాజకీయాల్లో కొత్త రకమైన ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.

# గవర్నర్ మార్పు... అధికారమే లక్ష్యం





**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

తెలంగాణ రాజ్‌భవన్‌లో సీన్ మళ్లీ మొదటికి వచ్చిందా? 'నిశ్శబ్దంగా' ఉన్న గవర్నర్ స్థానంలోకి 'చురుకైన' కొత్త గవర్నర్ రావడంతో ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో మళ్లీ ఏదో ఒక పెద్ద సంచలనమే రాబోతోందని అర్థమవుతోంది..తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశాంతంగా అందరితో కలిసిపోయి కాలం గడిపేస్తుంటే ఉన్నట్టుండి ఆయనను మహారాష్ట్రకు మార్చడం, హిమాచల్ ప్రదేశ్ నుంచి శివ ప్రతాప్ శుక్లాను తీసుకురావడం చూస్తుంటే? ఇది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పునా లేక 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ వేసిన మాస్టర్ ప్లానా? అని రాజకీయ విశ్లేషకులు ముక్కున వేలేసుకుంటున్నారు. యూపీ రాజకీయాల్లో ఆరితేరిన శివ ప్రతాప్ శుక్లా గారు రాకతో ఇక రాజ్ భవన్ 'రిమోట్' ఎక్కడి నుంచి పనిచేస్తుందోననే ఆందోళన కాంగ్రెస్ వర్గాల్లో కనిపిస్తోంది.అసలు అసలైన 'ట్విస్ట్' ఇక్కడే ఉంది. మన టీజేఎస్ అధినేత కోదండరాం ఎమ్మెల్సీ సీటు దశాబ్దాల కాలక్షేపంలా మారితే ఇప్పుడు మంత్రి అజారుద్దీన్ కూడా ఆ 'త్రిశంకు స్వర్గంలో' చిక్కుకున్నారు. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక 6 నెలల్లోపు సభ్యత్వం ఉండాలి. సమయం దగ్గరపడుతోంది. క్యాబినెట్ పంపిన ఫైల్ ఇప్పుడు కొత్త గవర్నర్ టేబుల్ మీదకు వెళ్తుంది. ఆయన ఆ ఫైల్‌ను స్వీకరిస్తారా లేక "ఇది సెట్ అవ్వదు" అని పక్కన పెడతారా? సుప్రీంకోర్టు తీర్పుల దాకా ఎందుకు? 'రాజ్ భవన్ కోర్టు'లో ఏం జరుగు తుందన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పటిదాకా "రాజకీయంగా విరోధం.. పాలనాపరంగా మైత్రి" అని రేవంత్ సర్కార్ సాఫీగా నడిపిస్తోంది. కానీ, కొత్త గవర్నర్ రాకతో ఆ 'మైత్రి' కూడా ఎండమావిలా మాయమవుతుందేమోనన్న భయం అధికార పక్షాన్ని వెంటాడుతోంది. మొత్తానికి గవర్నర్ వ్యవస్థ ఇప్పుడు తెలంగాణలో మళ్లీ ఒక 'కీలక రాజకీయ అస్త్రం'గా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

# ఉగాది తర్వాత కర్ణాటకకు కొత్త సీఎం..

**బెంగళూరు- సూర్య వాస్తవం**





కర్ణాటక ముఖ్యమంత్రి పదవిపై జరుగుతున్న ప్రచారానికి తెరపడటం లేదు. అటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వర్గం.. సీఎం మార్పు లేనే లేదంటూ వ్యాఖ్యలు చేస్తుండగా.. ఇటు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వర్గం మాత్రం.. త్వరలోనే కర్ణాటక సీఎం పగ్గాలు డీకేఎస్ చేతికి వస్తాయనే ధీమాతో ఉన్నారు. ఇక మిగిలిన కాంగ్రెస్ నేతలు కూడా కొందరు తాము కూడా సీఎం రేసులో ఉన్నామంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. అయితే ప్రధాన పోటీ మాత్రం సిద్ధూ, డీకేఎస్‌ల మధ్యే ఉంది. గత కొన్ని నెలలుగా కర్ణాటక సీఎం మార్పుపై అనేక ఊహాగానాలు వస్తుండగా.. అటు సిద్ధూ, ఇటు డీకేఎస్ వాటిని ఖండిస్తూ.. కలిసిపోతున్నారు. అయితే ఇప్పుడు మాత్రం పరిస్థితిలో కొంత మార్పు వస్తోంది.ఉగాది పండగ తర్వాత కర్ణాటక ముఖ్యమంత్రి మార్పు ఉంటుందని సాగుతున్న జోరు ప్రచారంపై సీఎం సిద్ధరామయ్య తాజాగా స్పందించారు. ఒకవేళ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి పీఠాన్ని వదలాలని తనకు సూచిస్తే.. వదిలిపెట్టేందుకు తనకు ఎలాంటి అభ్యంతరం లేదని సిద్ధూ తేల్చి చెప్పారు. పార్టీ ఆదేశాల మేరకు సీఎం పీఠం నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. తన సొంత నియోజకవర్గం వరుణలోని పిల్లాహల్లి హెలిప్యాడ్ వద్ద మీడియాతో శనివారం మాట్లాడిన సిద్ధరామయ్య.. కర్ణాటకలో అందరికంటే ఎక్కువసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన సంతృప్తి తనకు ఉందని తెలిపారు.పార్టీ హైకమాండ్ ఇంకా అవకాశం కల్పిస్తే మరో రెండుసార్లు బడ్జెట్ తానే ప్రవేశపెడతానని స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం ఏం చెబితే అది చేస్తానని.. హైకమాండ్ నిర్ణయానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉన్నానని తేల్చి చెప్పారు. పార్టీ పెద్దలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

2023లో జరిగిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి.. అధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మధ్య సీఎం పీఠం విషయంలో తీవ్ర పోరు నడిచింది. పోటాపోటీగా రెండు వర్గాలు ఢిల్లీలో క్యాంప్‌లు వేసి మరీ హైకమాండ్‌ను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు జరిపాయి. కొన్ని రోజుల పాటు సాగిన ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్యను, ఉపముఖ్యమంత్రిగా డీకే శివకుమార్‌ను నియమించింది. అయితే ఇది రెండున్నరేళ్లు మాత్రమేనని.. ఆ తర్వాత ముఖ్యమంత్రి పగ్గాలు డీకే శివకుమార్‌కు అప్పగిస్తారనే ప్రచారం మొదటి నుంచీ జరుగుతున్నా అది మాత్రం నెరవేరడం లేదు.

## ఉపాధి హామీ యాత్రలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ధ్రువకుమార్ రెడ్డి



**పులివెందుల – సూర్య వాస్తవం :** పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో నిత్యం ఆమె వెంట ఉంటూ యాత్ర విజయవంతం చేయుటలో కాంగ్రెస్ పార్టీ సైనికుల వలే భాగస్వాములై విజయవంతంగా నాల్గవ షెడ్యూల్ పూర్తి చేసుకున్న సందర్భంగా అమలాపురం వద్ద షర్మిల రెడ్డిని కలిసిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర కమిటీ సభ్యులు (పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి)మూలం రెడ్డి ధ్రువ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిట్టా రామిరెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ క్రీడా విభాగపు ఛైర్మన్ జివివిఎడ్ కమలాకర్ రావు, శ్రీకాళహస్తి నియోజకవర్గం సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి, తదనంతరం వారు మాట్లాడుతూ ఏపీసీసీ రథసారధి వైయస్ షర్మిలా రెడ్డి ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గం బండ్లపల్లి నుండి మొదలు పెట్టిన ఉపాధీహామీ పరిరక్షణ 4వ షెడ్యూల్ ఈ రోజు ముగిసింది. ఈ యాత్రలో ఉపాధిహామీ కార్మికులు వారి బాధలను, ఈ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని షర్మిలమ్మ కువివరిస్తున్నారు. ప్రజలందరు కుడా రాష్ట్రవ్యాప్త పర్యటనలో వైఎస్ షర్మిల రెడ్డి మీద వైఎస్ రాజశేఖర్ రెడ్డి మీద ఏ విధంగా అభిమానం, ప్రేమ, అనురాగాలు చూపిస్తున్నారో అధే విధంగా చూపిస్తున్నారు. మల్లి 5వ షెడ్యూల్ 13వ తేది నుంచి ప్రారంభమవుతుందని అన్నారు.

## దోమల నియంత్రణ... మనందరి భాద్యత

**- సబ్ యూనిట్ అధికారి సిద్ధయ్య**



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల అర్బన్ పరిధిలోని వెంకటాపురంలో ఇంటింటా లార్వా సర్వే, ఫీవర్ సర్వే నిర్వహించి, ఇంటి పరిసరాలలో దోమల పెరుగుదలకు కారణమయ్యే నీటి నిల్వలను తొలగించడం ఎంత ముఖ్యమో ప్రజలకు వివరించారు.సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ ప్రతి ఇంట్లో వారానికి ఒక రోజు డ్రైడే పాటించడం ద్వారా దోమల వృద్ధి తగ్గుతుందని, తద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి దోమల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించ వచ్చని, ఇంటి లోపల, బయట ఉపయోగించని కంటైనర్లలో, కూలర్‌లలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రాత్రి సమయంలో దోమతెరాలు వాడాలని సిద్దయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సోమలింగారెడ్డి, నాగమణి ఆశా కార్యకర్త రాజమ్మ పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్‌గా ఆర్డీవో జీ.చిన్నయ్య నియామకం



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల మున్సిపాలిటీకి ప్రత్యేకాధికారిగా (స్పెషల్ ఆఫీసర్ ) పులివెందుల రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) జీ.చిన్నయ్యని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీ పరిపాలనను మరింత సమర్థంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు గాను ఆర్డీవో చిన్నయ్య కి ఈ అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పులివెందుల మున్సిపాలిటీ పాలకవర్గం గడువు ఈ నెల మార్చి 17వ తేదీతో ముగియనుంది,ఈ నేపథ్యంలో పరిపాలనలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తుగా ఈ నియామకం చేపట్టినట్లు తెలుస్తోంది. ప్రజలకు అందుబాటులో ఉంటూ,మున్సిపల్ అభివృద్ధి పనులను పర్యవేక్షించేందుకు ఈ నిర్ణయం దోహదపడనుంది.

## వేణుగోపాల స్వామి ఆలయంలో ఖండ సద్భావన సదస్సు



**సింహాద్రిపురం– సూర్య వాస్తవం :** సింహాద్రిపురంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఖండ సద్భావన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రధాన వక్తగా కత్తిరామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విశ్రాంత ప్రిన్సిపల్ అజ్జగుట్టు వెంకట నాథారెడ్డిలు హాజరై హిందూ తత్వాన్ని గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి సత్యప్రకాశ్ రెడ్డి,లక్ష్మీనారాయణ రెడ్డి, అమర్ నాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, ప్రకాశ్ రెడ్డి టీచర్ రేగడి పల్లి ప్రభాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్

# విడుదల చేయకపోవడం శోచనీయం

**- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి**



**వేంపల్లె –సూర్య వాస్తవం :** కేంద్ర ప్రాయోజిత పథకాల కింద రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విడుదల చేయాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయని కారణంగా కేంద్ర ప్రభుత్వము తన వాటాగా విడుదల చేసిన నిధులు బ్యాంకు ఖాతాలలో మురుగుతూ ఉండడం దురదృష్టకరం, శోచనీయం అని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ఆవేదన వెలిబుచ్చారు. మంగళవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో తులసి రెడ్డి మాట్లాడుతూ 66 కీలకమైన కేంద్ర ప్రాయోజిత పథకాల కింద కేంద్ర ప్రభుత్వము తన వాటాగా విడుదల చేసిన 6260 కోట్ల రూపాయలు ఖర్చు కాకుండా మూలుగుతూ ఉండడం శోచనీయమని అన్నారు. ఉపాధి హామీ పథకం కింద 784 కోట్ల రూపాయలు, పీఎం ఆవాస్ యోజన పథకం కింద 649 కోట్ల రూపాయలు, ప్రధానమంత్రి సడక్ యోజన, లింక్ రోడ్ల పథకం కింద 442 కోట్ల రూపాయలు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద 452 కోట్ల రూపాయలు, వైద్య విద్యాభివృద్ధి కింద 389 కోట్ల రూపాయలు ఖర్చు కాకుండా ఆయా బ్యాంకు ఖాతాలలో మూలుగుతూ ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా విడుదల చేయాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడమే ఇందుకు కారణం. రాష్ట్ర ప్రభుత్వ అసమర్ధతకు ఇది పరాకాష్ట.అప్పులు తెచ్చుకోవడంలో ఉన్న శ్రద్ధ మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయడంలో లేకపోవడం గర్హనీయం. ఇదేనా సంపద సృష్టి అంటే అని తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయకపోతే కేంద్ర ప్రభుత్వము తదుపరి విడతగా ఇచ్చే నిధులు విడుదల చేయదు.వచ్చే సంవత్సరం కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయింపులు తగ్గిపోతాయి. ఇప్పటికైనా ఏమాత్రం ఆలస్యం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ ను వెంటనే విడుదల చేసి మొత్తం నిధులను సద్వినియోగం చేసి సకాలంలో వినియోగ ధ్రువీకరణ పత్రాలను కేంద్రానికి సమర్పించాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం ప్రసాద్ గౌడ్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షులు బీగాల రామకృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న,తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, బండారు వెంకటేశు చిన్నకోట్ల నాగరాజు, వినయ్, ఐచర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల విద్యాభ్యున్నతికి కృషి చేసిన

# దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే





**వేంపల్లె – సూర్య వాస్తవం :** మహిళల విద్యాభ్యున్నతికి కృషి చేసిన దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే అని నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి కొనియాడారు. మంగళవారం సావిత్రి బాయి పూలే వర్ధంతి సందర్భంగా నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొట్టె నారాయణ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో సావిత్రిబాయి పూలే చేసిన సేవలు అమూల్యమైనవని తెలిపారు. మహిళల విద్య కోసం ఎన్నో అవమానాలు, ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ఆమె వెనక్కి తగ్గకుండా సమాజంలో మార్పు తీసుకువచ్చిన గొప్ప మహనీయురాలని అన్నారు. మహిళలకు విద్య అందించడంలో ఆమె చూపిన పట్టుదల నేటి తరానికి ఆదర్శమని, విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి సావిత్రిబాయి పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని చదువులో ముందుకు సాగాలని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని సావిత్రిబాయి పూలేకు ఘనంగా నివాళులర్పించారు.



## పుడమితల్లికి పిఎమ్‌డిఎడ్ తొలి నైవేద్యం

**పులివెందుల – సూర్య వాస్తవం:** ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో రుతుపవనాలు రాకముందే భూసారానికై వాడేటటువంటి వజ్రాయుధం లాంటి పద్ధతే పిఎమ్‌డిఎస్( ప్రి మాన్సూన్ డ్రై సోయింగ్ ) పద్ధతి. ఈపిఎమ్‌డిఎస్ పద్ధతిలో 25-30రకాల విత్తనాలతో ఒక ఎకరాకు 20కేజీల విత్తనాలను వేయాలి. ఇలా విత్తనాలని పిఎమ్‌డిఎస్ కిట్స్‌గా తయారు చేసి వేముల మండలం దుగ్గన్నగారి పల్లి మూలి లక్షిదేవి అందుబాటులో ఉంచారు. ఈపిఎమ్‌డిఎస్ కిట్‌కు సరిపడా విత్తన రకాలను తన సొంత పొలంలో 14రకాలను, మిగతావి పక్క గ్రామం, మండలాల నుండి జిల్లా మార్కెటింగ్ టీం సహకారంతో సేకరించి 2450కేజీల విత్తనాలను పి ఎమ్ డి ఎస్ కిట్ల రూపంలో సదరు మండల సిబ్బంది సహకారంతో సిద్ధంగా ఉంచారు. కిట్ విలువ కేవలం 900రూపాయలు మాత్రమే అని రైతులకు తెలియజేసారు. జిల్లా ఎన్‌ఎఫ్‌ఏ శ్రీనాధ్ రెడ్డి మాట్లాడుతూ ఈ పద్ధతి వలన పంట వేసే 50రోజులు ముందుగా పి ఎమ్ డి ఎస్ ను వేసి 35-45 రోజుల మధ్య కాలంలో కరుకైనా ఆకు మరియు బాగా పూత సమయంలో కలియ దున్ని బాగా క్రుళ్ళిన తరువాత ప్రధాన పంట పెట్టుకోవాలి. ఇలాపి ఎమ్ డిఏస్ వేయడం వలన భూమికి నేరుగా పోషకాలు భూమికి అందుతాయని భూమి సారవంతంగా, ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలియజేస్తూ, ప్రతి రైతు ఈ పద్ధతిని అవలంభించాలని తెలియజేసారు . కార్యక్రమంలో, ఎఫ్ఎంటి భాస్కర్ రెడ్డి, రామ్మోహన్, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు .

## ఘనంగా పిళ్ళా వెంకటేశ్వరరావు జయంతి వేడుకలు



**విజయవాడ – సూర్య వాస్తవం :**

ప్రముఖ కాపు నాయకుడు పిళ్ళా వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా సోమవారం విజయవాడ గాంధీ నగర్‌లోని కౌతవారి సత్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సభ్యులు, నాయకులు మరియు పలువురు ప్రముఖులు హాజరై ఆయన సేవలను స్మరించుకున్నారు. పిళ్ళా శ్రీదేవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, పిళ్ళా వెంకటేశ్వరరావు మనవడు చిరంజీవి జ్ఞానేష్ కేక్ కటింగ్ చేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేడిశెట్టి శేషగిరి మాట్లాడుతూ పిళ్ళా వెంకటేశ్వరరావు కాపు సమాజ హక్కుల కోసం గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఉద్యమాలు నడిపిన అసలైన నాయకుడని పేర్కొన్నారు. ఆయన కేవలం కాపులకే కాకుండా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలందరికీ నాయకుడిగా గుర్తింపు పొందిన వ్యక్తి అని తెలిపారు. నేటి తరం నాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సంగీత కచేరి సభ్యులను ఆకట్టుకుంది. ఇందులో రేణు ఉమా, రాయి రాజు, నాగేందర్ పాల్గొన్నారు. ఈ వేడుకను లంకా రాంబాబు పర్యవేక్షించగా, ఆర్జా పాండురంగారావు, వేల్పూరి శ్రీనివాస్, రాఘవ, మంగళగిరి రమణ, సూర్యలక్ష్మి, పిడుగు లక్ష్మి, జయప్రద, ఈశ్వర్, చిన్నా, జమ్మలమూడి దాస్, కృపాదనం, ఖాజావల్లి, చంద్రశేఖర్ తదితరులు హాజరయ్యారు.

# కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యానికి ప్రాధాన్యత

**- ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం**
**- కుప్పంలో హెచ్‌పీవి వ్యాక్సిన్ ప్రారంభం**




**కుప్పం - సూర్య వాస్తవం :** కూటమి ప్రభుత్వంలో ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం తెలిపారు. మంగళవారం కుప్పం పట్టణంలోని కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో హెచ్ పి వి వ్యాక్సినేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల ఆరోగ్యాన్ని కాపాడడం మరియు భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులను నివారించడానికి ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన సంజీవని ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు. బాలికల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కుప్పం పట్టణ ఆరోగ్య కేంద్రం సిబ్బందిని ఈ వ్యాక్సిన్ వల్ల కలిగే ఉపయోగాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పిఎంకె చుడా అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు మాట్లాడుతూ మన వయోజన ఆడపిల్లలు గర్భాశయకేన్సర్తో బాధపడకుండా కేంద్ర ప్రభుత్వం ఈ వ్యాక్సిన్ ను తీసుకొచ్చినందుకు ఆయన అభినందిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కుప్పం నుంచే కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషకరమైన విషయం అన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది బాలికలకు హెచ్ పి వి వ్యాక్సిన్ అందించి, తల్లిదండ్రులు, విద్యార్థులకు ఈ వ్యాక్సిన్ యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి బాలికా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ఆనందంగా ఉందని సురేష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ కణ్ణన్, తెదేపా నేతలు డాక్టర్ వెంకటేష్, తెదేపా శ్రేణులు, మరియు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి దీప్ కుమార్, సూపర్ వైజర్ సుమిత్ర, ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



## కడప జిల్లా జేసీతో ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి భేటీ




**పులివెందుల - సూర్య వాస్తవం :** శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనా ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జిల్లా జేసీగా బాధ్యతలు చేపట్టిన నిధి మీనాకి ఎం.ఎల్.సి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం జిల్లాలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ నారాయణ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులను కలిసిన వైజిఆర్ ట్రస్ట్ చైర్మన్



**సింహాద్రిపురం - సూర్య వాస్తవం :** వైసీపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఆలూరు సాంబశివరెడ్డిని నంద్యాల పల్లెకు చెందిన వైజిఆర్ ట్రస్ట్ చైర్మన్ ఎర్ర నాగు శ్రీధర్ రెడ్డి కలిశారు. మంగళవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ట్రస్టు ద్వారా ప్రోత్సాహ బహుమతులను అందజేయడం ఎంతో అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృత స్థాయిలో చేపట్టాలని సూచించారు. అదేవిధంగా డిగ్రీ, పాలిటెక్నికల్, ఇంజనీరింగ్ చదివిన విద్యార్థులకు సాఫ్ట్ వేర్ రంగంలో ఉపాధి కల్పనకై కృషి చేయాలని ఇందుకు తన వంతు సహకారం ఉంటుందని పేర్కొన్నట్లు శ్రీధర్ రెడ్డి తెలిపారు.

## వైభవంగా శ్రీ చౌడేశ్వరి దేవి మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, రైతు విభాగం కార్యదర్శి



**శింగనమల- సూర్య వాస్తవం :** శింగనమల మండలం కల్లుమడి గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి దేవర మహోత్సవం మంగళవారం అత్యంత వేడుకగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.పూజల అనంతరం ఆలయానికి చేరుకున్న నేతలకు గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. కేతిరెడ్డి పెద్దారెడ్డి, వంశీ గోకుల్ రెడ్డిలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని ఆ చౌడేశ్వరి దేవి దీవెనలు చల్లగా ఉండాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఉత్సవాలు భక్తిభావాన్ని పెంపొందించడమే కాకుండా, ప్రజల మధ్య ఐక్యతను చాటుతాయని వారు కొనియాడారు. శింగనమల పరిసర ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కల్లుమడి గ్రామం భక్తి పారవశ్యంతో పులకించిపోయింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సర్పంచు, ఎంపీటీసీ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 5న అన్నమయ్య కీర్తనలహరి



**రాయచోటి - సూర్య వాస్తవం:** నియోజకవర్గ కేంద్రమైన రాయచోటిలో పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు రచించి గానం చేసిన అన్నమయ్య కీర్తనలను గాయనీ గాయకులచే (ఈవెంట్) ట్రాక్ లో కీర్తనలు పాడుటకు అవకాశం ఇవ్వడం జరుగుతుందని ఏఐఆర్ సింగర్ టి.హరినాథ్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 5న రాయచోటి, కొత్తపేటలో జరిగే ఈవెంట్ సక్సెస్ చేయుటకు స్థానిక కళాకారులతో పాటు ప్రతి ఒక్కరు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కొత్తగా అన్నమయ్య కీర్తనలను పాల్గొన్నవారికి సోలో 1 కీర్తన ట్రాక్ లో డ్యూ యెట్‌లు 3 కీర్తనలు పాడే విధంగా ఏర్పాటు చేస్తున్నామనీ తెలియజేశారు. ముందుగా ఎంపిక చేసుకున్న కీర్తనలు పంపిన వారికి నచ్చిన కీర్తనలు ఆనందంగా ఆలపించుటకు అవకాశం కల్పించడం జరుగుతుందని ఆయన చెప్పారు. సోలోలో ఒకరు పాడిన కీర్తన వేరొకరు పాడుటకు అవకాశం లేదని, అయితే డ్యూయిట్ లో ఇద్దరు పాడుటకు అవకాశం వుందన్నారు. ఈవెంట్ ఆర్గనైజర్ కు మీరు పాడబోవు కీర్తనలు ఎంపిక చేసుకోని ఆలస్యం చేయక వెంటనే



## సీఎం సభను విజయవంతం చేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు

**- ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్**


**డోన్ - సూర్య వాస్తవం:** నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం కొత్తబురుజు గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని , తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్క రైతుకు, ప్రజలకు, నాయకులకు, అధికారులకు, మీడియా మిత్రులకు, కార్యకర్తలకు డోన్ నియోజకవర్గం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి, డిసిఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయాలి: బీటీఏ



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పల్లం రామచంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి జీ రాజశేఖర్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఏవీ రమణ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్, అన్నమయ్య జిల్లా ఆర్థిక కార్యదర్శి సీవీ రమణ డిమాండ్ చేశారు ఈరోజు వారు చదువుల తల్లి క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ సర్కిల్లో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. సావిత్రి బాయి పూలే బాటలో అణగారిన బడుగు బలహీన వర్గాల విద్య, వారి అభ్యున్నతి కోసం బీటీఏ పని చేస్తుందని వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయు లకు మెరుగైన పిఆర్సీ ఇస్తామని డిఏ బకాయిలు సకాలంలో చెల్లిస్తామని సంపాదిత సెలవుల నగదును జడ్పీపీఎఫ్ లోన్లను వెంటనే మంజూరు చేస్తామని ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న ఎన్నికల హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. ఎన్నికల హామీల సాధన కోసం విద్యా రంగా సమస్యలు పరిష్కారంలో భాగంగా బీటీఏ ఆధ్వర్యంలో దశల వారి ఉద్యమాన్ని చేపట్టినట్టు వారు తెలియజేశారు. అనంతరం వివిధ మండల కమిటీలను ప్రకటించారు. వీరబల్లి మండల అధ్యక్షులుగా కె రాజ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా డి నాగార్జున, సుండుపల్లి మండల అధ్యక్షులుగా ఇర్షాద్ ప్రధాన కార్యదర్శిగా బీఎస్ ఆంజనేయులు,ఆర్థిక కార్యదర్శిగా వీరాంజనేయులను, రాయచోటిమండల అధ్యక్షులుగా సోనూ నాయక్ ప్రధాన కార్యదర్శిగా రఘునాథ పార్టీ కార్యదర్శులు ఎస్ వి రమణలను అలాగే గాలివీడు మండల అధ్యక్షులుగా శ్రీరాములు ప్రధాన కార్యదర్శిగా సాకే సత్యమయ్యలను ఎన్నుకున్నట్లు వారు తెలియజేశారు.

## హంద్రీనీవా కాలువలో వ్యక్తి గల్లంతు




**ఉరవకొండ - సూర్య వాస్తవం:** మండల పరిధిలో ఇంద్రావతికి చెందిన వడ్డే శ్రీనివాసులు హంద్రీ నీవా కాలు వలో పడి గల్లంతయ్యాడు. కాలువ గట్టుపై ఆయన దుస్తులు, బైక్ లభించడంతో నీటిలోకి దూకి నట్లు అనుమానిస్తున్నారు. గ్రామ స్తులు ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం అతన్ని కోసం తీవ్రంగా గాలిస్తున్నారు. ఇంకా ఆచూకీ తెలియరాలేదు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గ్రామస్తులు ద్వారా తెలిసిన సమాచారం ప్రకారం వివరాల్లోకి వెళితే వడ్డే శ్రీనివాసులు మూడు ఎకరాల భూమి ఉండగా అందులో వ్యసాయం చేసుకుంటా జీవనం సాగించేవాడు. అతనికి భార్య ముగ్గురు ఆడపిల్లలు సంతానం ఉన్నారని సమాచారం. ఈతకు వెళ్లి గల్లంతయ్యాడా, లేక ఆత్మహత్య అనేది పోలిసుల విచారణలో తెలియాల్సివుంది.వ్యవసాయం కోసం చేసిన బాకీలు ఉన్నట్లు స్థానికులు చెబుతుండటం విశేషం.

## ఆమనగంటి శ్రీరాములు 105 జయంతి

**- ఘనంగా నివాళులు అర్పించిన ఉద్యోగ సభ్యులు**

**పులివెందుల - సూర్య వాస్తవం:** ఏపీఎన్‌జిఓస్ పులివెందుల తాలూకా కార్యాలయంలో మంగళవారం ఆమనగంటి శ్రీరాములు 105 జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర జిల్లా, అధ్యక్షుల వారి ఆదేశాల ప్రకారం మన పులివెందుల తాలూకా అధ్యక్షులు గజ్జల జగన్నాథరెడ్డి ఆధ్వర్యంలో ట్రెజరర్ వై. రామ గంగాధర్ రెడ్డి యాదవ్, వైస్ ప్రెసిడెంట్ వై ప్రభు కుమార్, వైస్ ప్రెసిడెంట్ జి శంకరయ్య వైస్ చైర్మన్ డి.బాలకృష్ణారెడ్డి జేఏసీ వైస్ చైర్మన్ శ్రీ ఏ శ్రీనివాసులు కో కన్వీనర్, పి గంగయ్య, పంచాయతీ రాజ్ డిపార్ట్మెంట్ ఏవో సౌరెడ్డి, అన్ని డిపార్ట్మెంట్ విభాగాలకు సంబంధించిన ఉద్యోగ సభ్యులు ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఎన్ లక్ష్మి రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని ఆమనగంటి శ్రీరాములు సేవలను కొనియాడారు.



# పేదల సొంతింటి కల నెరవేర్చే వేడుక

- నాయుడుపేటకు టిడ్కో గృహ సముదాయం ప్రారంభానికి సీఎం చంద్రబాబు
- 17న టిడ్కో ఇళ్ల ప్రారంభానికి రంగం సిద్ధం
- లబ్ధిదారులకు తాళాలు, పట్టాల పంపిణీ
- సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్
- నాయుడుపేటలో సీఎం పర్యటనకు వేగవంతమైన ఏర్పాట్లు
- హెలిప్యాడ్, సభా ప్రాంగణం పరిశీలించిన అధికారులు



**నాయుడుపేట - సూర్య వాస్తవం:** పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా తిరుపతి జిల్లా నాయుడుపేటలో నిర్మించిన టిడ్కో గృహ సముదాయాన్ని ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు, తాళాలను ముఖ్యమంత్రి అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో నాయుడుపేటలో ఏర్పాట్లు వేగవంతంగా జరుగుతున్నాయి. మంగళవారం తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారు. టిడ్కో గృహ సముదాయం ప్రాంతం, హెలిప్యాడ్, బహిరంగ సభ ప్రాంగణాన్ని జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న ముఖ్యమంత్రి నాయుడుపేటకు విచ్చేసి టిడ్కో గృహాలను ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శానిటేషన్, పచ్చదనం, మొక్కలు నాటడం, విద్యుత్, ఆర్ అండ్ బి తదితర పనులను వేగవంతం చేసి ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలని పోలీసు అధికారులకు సూచించారు. సభా ప్రాంగణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించాలని కూడా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మండల చైర్‌పర్సన్ షేక్ రఫీ, ఎంసీ డైరెక్టర్ ఉయ్యాల ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.



# ఇన్‌స్టాగ్రామ్ వద్దు..... శక్తి యాప్ ముద్దు



**అనంతపురం - సూర్య వాస్తవం :** సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండండి అని శక్తి టీం ఏఎస్ఐ బాబావలి. హెడ్ కానిస్టేబుల్ రమాదేవిలు తెలియజేశారు. మంగళవారం అనంతపురం రూరల్ సబ్ డివిజన్ పరిధిలో శక్తి టీమ్ ఆధ్వర్యంలో రాప్తాడు పోలీస్ స్టేషన్ పరిధిలోనిగొల్లపల్లి గ్రామంలోని మాంటిసోరి ఈలైట్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందువిద్యార్థినీలకు ఉపా ధ్యాయులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రమాదేవి మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలని వాటి యొక్క ఉపయోగాలు తెలియజేశారు, మహిళలపై, చిన్నారులపై జరుగుతున్న నేరాలపై, పెట్టుకోవడం వల్ల జరిగే ప్రమాదం గురించి ఇన్స్టాగ్రం లో రీల్ వల్ల జరిగేప్రమాదాలు, గుర్తుతెలియని వ్యక్తులతో ఫోటో దిగితే వారు ఫోటో మర్ఫింగ్ చేసి బ్లాక్మెయిల్ చేస్తారన్నారు,

ఫేక్ ఫోన్ కాల్స్ బ్యాంకుల నుండి ఫోన్ కాల్స్ ఓటీపీ గురించి అవగాహన కల్పించారు,సైబర్ నేరాలు ఏటీఎం మోసాల డ్రగ్స్ గురించి,సైబర్ నేరాల గురించి సెల్ఫ్ డిఫెన్స్ ఎలా చేయాలి అని తెలియజేశారు, శక్తి యాప్‌లో ఉన్న నైట్ షెల్టర్‌ను వినియోగించుకోవచ్చని ఆటో ఎక్కినప్పుడు డ్రైవర్ సస్పెక్టెడ్ గా వుంటే సాస్ చేసి వారిని ఏవిధంగా ప్రొటెక్ట్ చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఆధ్యాపక బృందం. ఏఎస్ఐ బాబావలి. హెడ్ కానిస్టేబుళ్లు రమాదేవి, పైగంబర్ వలి పిసీలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డి.ఏ.పి.సి.సి

# కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సోసైటీ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డి.ఏ.పి.సి.యు, పి.ఎం.పి.ఎస్.ఈ కార్యక్రమాలపై కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. జిల్లాను హెచ్ఐవి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. క్లస్టర్ ప్రోగ్రాం అధికారి భాస్కర్ మాట్లాడుతూ... ఏపీయస్ఏసీయస్ ఆధ్వర్యంలో అమలవుతున్న నివారణ కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్లాలని, కమ్యూనిటీ భాగస్వామ్యాన్ని పెంపొందించాలని సూచించారు. కమ్యూనిటీ అడ్వైజరీ బోర్డు సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ హెచ్ఐవి నివారణ చర్యలను బలోపేతం చేయాలని తెలిపారు. అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాధిక మాట్లాడుతూ ... నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలను అమలు చేయాలని సూచించారు. డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ... హెచ్ఐవి డ్రాప్అవుట్స్ తగ్గించే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవగాహన కార్యక్రమాలను మరింత విస్తరించాలని తెలిపారు. ఈ సమావేశంలో డెమో ఆఫీసర్ దేవసిరోమణి, డి.ఏ.పి.సి.యు సిలార్ సాబ్, ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, ఏఆర్టి సెంటర్ కౌన్సిలర్లు పుల్లయ్య నాయుడు, శ్రీనివాసులు, ఉమాదేవి, దీప్తి, టి.ఐ. ఎన్జీఓ మేనేజర్లు టి. స్వాతి, పురుషోత్తం, ఓబులేసు, శ్రీనివాసులు కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# 22 వరకు దుర్గమ్మ ఆలయంలో నిత్య అభిషేకాలు

**- ఆలయ వ్యవస్థాపకుడు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి**



**వేంపల్లె - సూర్య వాస్తవం:** పట్టణంలోని స్థానిక సాయి నగర్ లో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమ్మ ఆలయంలో ఈనెల 22 వ తేది వరకు నిత్య అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు, జడ్పీటీసీ మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో దుర్గమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్టను మూడు రోజుల పాటు ఘనంగా చేపట్టడం జరిగిందని చెప్పారు. 22వ తేది వరకు అర్చనలు, మండల పూజలు, చేపట్టడం జరుగుతుందని, కాబట్టి ఉభయ దారులు కింద పూజలు చేయాలని అనుకొనే వారు ఆలయ పూజారికి చెందిన 9177193318 నెంబర్ కు ఫోన్ చేసి తేదిని నిర్ణయించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని ప్రతి భక్తుడు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


# ప్రధానిపై వివాదస్పద పోస్టులు పెట్టిన రాయచోటి రిహాన్‌పై చట్ట పరమైన చర్యలు



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై వివాదాస్పద వ్యాఖ్యలు పోస్ట్ పెట్టిన సందర్భంగా సదరు వ్యక్తి పై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో CR.No: 132/2026 U/Sec 196, 353(1)(ఎ), 353(2), 352 దీబీూ-2023 and Sec 67 of IT Act. సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. సమాజ శాంతికి హాని కలిగించే వార్తలు పంపితే శిక్షార్హులు అవుతారు. "ఫేక్ అకౌంట్స్ ప్రారంభించి సమాజంలో కలహాలు రేపేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు. "కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టేలా పోస్టులు పెట్టకండి; వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించవద్దు."""మహిళలు, చిన్నారులపై అసభ్యకర పోస్టులు, ఫోటో మార్ఫింగ్ చేసినా సహించం. జిల్లా స్థాయిలో రాయచోటి అర్బన్ ఇన్స్పెక్టర్ బి.వి. చలపతి, సైబర్ క్రైమ్ సి.ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు. సాంకేతిక పరిజ్ఞానంలో నిపుణులైన సిబ్బంది 24 గంటలు 7 రోజులు పర్యవేక్షణ చేస్తారు ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకోబడును. సోషల్ మీడియాను బాధ్యతగా వినియోగించండి. శాంతి భద్రతలకు భంగం కలిగించే పోస్టులు పెట్టేవారిపైనా, వారిని ప్రోత్సహించే వారిపైనా కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, ఆదేశాల మేరకు రాయచోటి ఎస్డిపిఓ, క్రిష్ణ మోహన్ నెటిజన్లను హెచ్చరించారు.

# వైసీపీ 15 వసంతాలు పూర్తి

- పులివెందులలో ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు
- ప్రతి గ్రామం, వార్డులో పండుగలా జెండా ఆవిష్కరణలు..
- పార్టీ శ్రేణులకు పిలుపు



**పులివెందుల - సూర్య వాస్తవం:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం (మార్చి 12) సందర్భంగా పులివెందుల నియోజకవర్గవ్యాప్తంగా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవ్వాలని పార్టీ కార్యకర్తలకు,నాయకులకు వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చింది. పార్టీ స్థాపించి 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ఈ వేడుకలు జరుపుతున్నట్లు వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయం తెలియజేసింది. పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో గడిచిన 15 ఏళ్లలో ఎన్నో సవాళ్లను అధిగమించి, సంక్షేమం మరియు అభివృద్ధిలో రాష్ట్ర చరిత్రలో చెరగని ముద్ర వేసిన వైనాన్ని ఈ సందర్భంగా పార్టీ గుర్తుచేసింది.గత రెండేళ్లుగా అధికార పార్టీ చేస్తున్న అప్రజాస్వామిక దాడులు, అక్రమ కేసులను ఎదుర్కొంటూ,ప్రజల పక్షాన ప్రజాస్వామికంగా పార్టీ చేస్తున్న పోరాటం అనిర్వచనీయమని పేర్కొన్నారు. 12.03.2026 (గురువారం) నియోజకవర్గంలోని ప్రతి గ్రామం,వార్డు మరియు మండల కేంద్రాలలో పార్టీ జెండాలను ఎగుర వేసి, దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు రంగులు వేసి, పూలమాలలతో ఘనంగా అలంకరించలన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కేవలం వేడుకగానే కాకుండా, పలు సామాజిక సేవా కార్యక్రమాలతో పండుగ వాతావరణంలో నిర్వహించాలని పులివెందుల నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రకటన ద్వారా తెలియజేసింది.




# ‘ఉస్తాద్ ..’ సెన్సార్ పూర్తయ్యింది

డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నటిస్తున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’ చిత్రం విడుదలకు సిద్ధమైంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం తాజాగా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది.

సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి ‘యు/ఎ’ సర్టిఫికేట్ జారీ చేసినట్లు చిత్రబృందం ప్రకటిం చింది. ఈ సినిమా 2 గంటల 29 నిమిషాల రన్ టైమ్‌తో రాబోతుం దని సమాచారం. హరీష్ శంకర్ తెరకెక్కించిన ఈ చిత్రంలో శ్రీలీల, రాశీ ఖన్నా ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు.

## 15న షార్ట్ ఫిలిమ్స్

# టాలెంట్ హంట్-2026



వైజాగ్ షార్ట్ ఫిలిమ్ మేకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న ఉదయం 10 గంటలకు విశాఖపట్టణం డాబాగార్డెన్స్‌లో అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం (5వ అంతస్తు)లో టాలెంట్ హంట్-2026పేరుతో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటుచేశారు. ఇందులో సినీరంగానికి సంబంధించి అన్ని వయస్సుల వారు పాల్గొనేలా అవకాశం కల్పించారు. నటీనటులు, నిర్మాతలు, దర్శకులు, రచయితలు, కెమెరా, ఎడిటింగ్ తదితర విభాగాలకు చెందిన నిపుణులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించొచ్చు.

అతిథులుగా సినీరంగానికి చెందిన ప్రముఖులు హాజరవుతున్నారు. ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి త్వరలో నిర్మించబోయే సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్‌లో అవకాశాలు దక్కుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మిగతా వివరాలకు సెల్‌లో 8885351807, 9642707036 సంప్రదించాలని కోరారు.

# ‘జైలర్-2’లో పోలీస్ ఆఫీసర్‌గా షారూఖ్?



రజనీకాంత్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న సినిమా ‘జైలర్-2’. 2023లో విడుదలైన జైలర్‌కు సీక్వెల్‌గా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ నటించబోతున్నట్లుగా సమాచారం.

ముత్తువేల్ పాండియన్‌గా మరోసారి రజనీకాంత్ సందడి చేయనున్నారు. పార్ట్-2ను దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. ఇదే ఏడాదిలో ఈ మూవీ విడుదల కానుంది. పవర్‌ఫుల్ పోలీస్ పాత్రలో నటించేందుకు షారూఖ్ కూడా అంగీకరించినట్లుగా తెలిసింది. ఏడు నుండి ఎనిమిది రోజుల పాటు చిత్రీకరించబడే అతని సన్నివేశాలతో ఈ సినిమా ఫైనల్‌షూట్ ముగుస్తుందని భావిస్తున్నారు. మార్చి చివరి వారంలో జైలర్ -2 సెట్స్‌లోకి ఎంట్రీ ఇస్తారని తెలుస్తోంది. ‘జైలర్’లో శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్ వంటి స్టార్ నటులు సినిమాను మలుపుతిప్పే అతిథి పాత్రల్లో నటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు షారూఖ్‌ఖాన్ కూడా అలాంటి పాత్రలోనే కనిపించబోతున్నారు. ఎస్‌జె సూర్య కూడా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రజనీకాంత్ కోడలు శ్వేతా పాండియన్ పాత్ర పోషించిన నటి మిర్నా కూడా ఈ సీక్వెల్‌లో కీలక పాత్ర పోషించనున్నారని పరిశ్రమలో చర్చ జరుగుతోంది.





# టీమిండియా ఆటగాళ్లపై కనకవర్షం

## - రూ.131కోట్ల నజరానా ప్రకటించిన బిసిసిఐ

**ముంబయి:** టి20 ప్రపంచ కప్‌ను వరుసగా రెండోసారి కైవసం చేసుకున్న టీమిండియా ఆటగాళ్లపై కనకవర్షం కురిసింది. జట్టు ఆటగాళ్లతో పాటు సహాయ సిబ్బందికి కలిపి భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) 131కోట్ల రూపాయలను వారికి అందజేయనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ విషయాన్ని బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపారు. ఐసిసి టి20 ప్రపంచ కప్‌ను మూడుసార్లు కైవసం చేసుకున్న ఏకైక జట్టు టీమిండియానే. ఈ ఫార్మాట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలోనూ ఒకటిగా టీమిండియా కొనసాగుతోంది. ఈ క్రమంలో తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకున్నట్లు సైకియా ఆ ప్రకటనలో తెలిపారు. ఈ మొత్తాన్ని 15 మంది ఆటగాళ్లతోపాటు కోచింగ్ స్టాఫ్, ఇతర సపోర్టింగ్ స్టాఫ్‌కు కూడా అందుకోనున్నారు. అత్యధిక నగదు మాత్రం ఆటగాళ్లకు సమంగా అందుతుంది. ఆ తర్వాత కోచింగ్ స్టాఫ్‌కు దక్కుతుంది. చివరగా సపోర్టింగ్ స్టాఫ్‌కు అందజేస్తారు. ఇక కెప్టెన్ సూర్య కుమార్‌కు అందరికంటే ఎక్కువగా భారీగా ప్రోత్సాహం అందుతుంది. 2024లోనూ భారీ నజరానా ప్రకటించింది. అప్పుడు రూ.125కోట్లు అందజేసింది. ఇక టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు అందించే ప్రైజ్‌మనీగా ఇండియాకు ఐసిసి నుంచి రూ.27.48 కోట్లు దక్కిన సంగతి తెలిసిందే. రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు రూ.14.65 కోట్లు అందాయి.

### ప్రపంచకప్ జట్టులో నలుగురికి చోటు

టి20 ప్రపంచకప్ ‘టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్’ ను ఐసిసి మంగళవారం ప్రకటించింది. ఇందులో నలుగురు భారత క్రికెటర్లకు చోటు దక్కగా.. కెప్టెన్‌గా దక్షిణాఫ్రికాకు చెందిన ఐడెన్ మార్‌క్రమ్ ఎంపికయ్యాడు. 321 పరుగు లతో ‘ప్లేయర్ ఆఫ్ ది టోర్నీ’గా నిలిచిన సంజూ శాంసన్ తో పాటు ఇషాన్ కిషన్ (317పరుగులు), హార్థిక్, స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (14 వికెట్లు)లకు చోటు దక్కింది.

**జట్టు:** మార్‌క్రమ్, ఎన్గిడి(దక్షిణాఫ్రికా), సాహిబ్‌జాదా ఫర్హాన్ (పాకిస్థాన్), శాంసన్, ఇషాన్, హార్థిక్, బుమ్రా(భారత్), విల్ జాక్స్ (ఇంగ్లండ్), హోల్డర్ (వెస్టిండీస్), రషీద్ (ఇంగ్లండ్), ముజార్బనీ (జింబాబ్వే) షాడ్లే(అమెరికా; 12వ ఆటగాడు).

# ప్రి క్వార్టర్స్‌కు బాంబ్రీ జోడీ

## - ఇండియానా వెల్స్ టెన్నిస్ టోర్నీ



**న్యూయార్క్:** ఇండియానా వెల్స్ టెన్నిస్ టోర్నీ ప్రి క్వార్టర్‌ఫైనల్లోకి యుకీ బాంబ్రీ జంట ప్రవేశించింది. స్వీడన్ ఆటగాడు ఆంద్రీ గోరెన్సన్‌తో జతకట్టిన బాంబ్రీ.. మంగళవారం జరిగిన రెండోరౌండ్ మ్యాచ్‌లో వరుససెట్లలో ఫ్రాన్స్ జంటను ఓడించారు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో బాంబ్రీ జంట 6-1, 6-3తో వరుససెట్లలో ప్రత్యర్థి జంటను ఓడించి ప్రి క్వార్టర్స్‌కు చేరారు. ఫ్రాన్స్ జంట 6 అనవసర తప్పిదాలు చేయడం కూడా బాంబ్రీ-గోరెన్సన్ జోడీకి కలిసిరాగా.. ఈ మ్యాచ సుమారు 66 నిమిషాలసేపు సాగింది. 23వ ర్యాంక్‌తో ఈ టోర్నీ బరిలోకి దిగిన భారత్-స్వీడన్ జంట ప్రి క్వార్టర్స్‌లో సండెర్ అరెన్స్-జిరి లెహెక్రాలతో తలపడనున్నారు. ఈ జంటకు తొలిరౌండ్ 2వ సీడ్ జంట వైదొలగడంతో వాకొవర్ లభించింది.

## ఆర్ఎంపీ డాక్టర్ గోపాల్‌పై

# తక్షణమే చర్యలు తీసుకోవాలి

### - సిపిఐ డిమాండ్





**వెంకటగిరి– సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా వెంకటగిరి టౌన్లో వైద్య వృత్తి పేరుతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న ఆర్ఎంపీ డాక్టర్ పి. గోపాల్ పై జిల్లా వైద్యాధికారులు విచారణ జరిపి కఠినంగా చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య వెంకటగిరి నియోజకవర్గ కార్యదర్శి పల్లిపాటి బాలకృష్ణయ్య ఒక ప్రకటనలో సంయుక్తంగా డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ వెంకటగిరి పట్టణంలో ఆర్యం పి వైద్యంతో దంపిల్ల ప్రేమానందం స్కూల్ బస్సు డ్రైవర్ కాలు పోవడానికి ప్రధాన కారకుడైన ఆర్.ఎం.పి గోపాల్ ను తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఆర్.ఎం.పి గోపాల్ ఎంబిబిఎస్ పట్టా లేకపోయినా శ్రీ విజయలక్ష్మి క్లినిక్ పేరుతో వెంకటగిరి చుట్టుపక్కల ఉన్న గ్రామీణ పేదల ఆరోగ్యాలతో చెలగాటమాడుతూ అనేకమంది చావులకు కారణం అవుతున్నాడన్నారు. నేడు దంపిల్ల ప్రేమానందం మాత్రమే కాదు గతంలో కూడా డాక్టర్ పి గోపాల్ వైద్యం వికటించి అనేకమంది తీవ్ర ఇబ్బందులకు గురవడంతో పాటు తిరుపతి లాంటి పెద్ద వైద్యశాలలో వైద్యం చేసుకున్న ప్రాణాలు దక్కించుకోలేని పరిస్థితులలో పేదల ప్రాణాలు గాలిలో కలిసి పోతున్నాయని గోపాలపై చర్యలు తీసుకోవడంలో వైద్య అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు. గోపాల్ కు కొంతమంది రాజకీయ నాయకులు కూడా వత్తాసు పలకడం వల్లే పేదల ప్రాణాలతో ఆర్ఎంపీ డాక్టర్ గోపాల్ చెలగాటమాడడానికి అవకాశాలు ఏర్పడుతున్నాయని వారు ఆవేదన చెందారు . విజయలక్ష్మి క్లినిక్‌లో వైద్యంతో పాటు మందులు కూడా అక్కడే అమ్ముతున్నారని, గోపాల్ దగ్గరకు వైద్యం కోసం పేద ప్రజలు వస్తుంటారని దానిని ఆసరాగా చేసుకుని రోగులకు అధిక మోతాదులో మందులు, సూదులు వేయడంతో రోగులకు వెంటనే రోగం తగ్గుతున్నట్లు వారు ఆరోపించారు, విపరితమైన డ్రగ్స్, యాంటీబయాటిక్స్ పేద ప్రజలకు వేస్తారని వారి నుండి ఒక నెలకు సరిపడా పెద్ద మొత్తంలో డాక్టర్ ఫీజు డబ్బులను వసూలు చేస్తున్నట్లు, అతనిపై గతంలో అనేక ఆరోపణలు వచ్చిన చర్యలు తీసుకోకపోవడంతోనే వైద్యంలో పట్టా పొందిన సర్జన్ డాక్టర్‌గా గోపాల్ వ్యవహారం ఉంటుందని, పేదలు ప్రైవేటు ఆసుపత్రికి వెళితే ఎక్కువ డబ్బులు అవు తుందన్న ఆలోచనతో గోపాల్ దగ్గరకు వైద్యం చేయిం చుకోవడానికి ప్రధాన కారణం అన్నారు.

ప్రేమానందం కాలు పోవడానికి కారకుడైన ఆర్ఎంపీ డాక్టర్ పి.గోపాలపై జిల్లా ఉన్నతాధికారులు, వైద్యాధికారులు విచారణ జరిపి కఠినంగా శిక్షించాలని అలా చేయని పక్షంలో విజయలక్ష్మి క్లినిక్ వద్ద సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# సంక్షేమ పథకాలకే 56 వేల కోట్లు



**హైదరాబాద్-సూర్య వాస్తవం:**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కేవలం అంకెల గారడీగా కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ రణక్షేత్రంగా మారబోతున్నాయి. ఒకవైపు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి శ్వేతపత్రం డిమాండ్‌తో సర్కారును కార్నర్ చేస్తుంటే, మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ప్రభుత్వ అప్పుల చిట్టాను విప్పుతూ ఎదురుదాడికి దిగుతున్నారు. సుమారు 3 లక్షల కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతున్న వేళ, రాష్ట్ర ఖజానా అసలు స్థితిగతులపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సంక్షేమం స అభివృద్ధి మధ్య సమతూకం పాటించడం ఇప్పుడు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు కత్తిమీద సాములా మారింది.రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అప్పుల ఊబి వేధిస్తోంది. గత పదేళ్లలో అప్పులు రూ. 7.5 లక్షల కోట్లకు చేరాయని ముఖ్యమంత్రి ఆరోపిస్తుండగా, అధికారిక లెక్కలు భిన్నంగా ఉన్నాయి. అయితే, ఏ లెక్క చూసినా నెలకు వేల కోట్ల రూపాయలు కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చించాల్సి వస్తోంది. ఈ డెట్ ట్రాప్ నుంచి బయటపడి, కొత్త ప్రాజెక్టులకు నిధులు మళ్లించడం ప్రభుత్వానికి అతిపెద్ద సవాలు. అప్పు తెచ్చి పప్పు కూడు అన్నట్లుగా కాకుండా, ఆదాయ వనరులను పెంచుకోవడమే ఏకైక మార్గమని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన ఆరు గ్యారంటీలు బడ్జెట్‌లో సింహభాగాన్ని ఆక్రమించనున్నాయి. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి వంటి పథకాల అమలుకు ఏటా రూ. 56,000 కోట్ల పైచిలుకు నిధులు అవసరమని అంచనా. ఎన్నికల వాగ్దానాలను నిలబెట్టుకోవాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం, ఈ నిధుల కోసం ఇతర శాఖల కేటాయింపుల్లో కోత విధిస్తుందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తూనే, మౌలిక సదుపాయాలను విస్మరించకూడదనే ఒత్తిడి సర్కారుపై ఉంది.రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడి వ్యయం విషయంలో ప్రభుత్వం కొంత వెనుకబడి ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో రూ. 36,000 కోట్లు కేటాయించినా, క్షేత్రస్థాయిలో ఖర్చు ఎంత అన్నదే కీలకం. జీతాలు, పెన్షన్లు వంటి రెవెన్యూ వ్యయం భారంగా మారుతున్న తరుణంలో, సాగునీటి ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణం వంటి ఆస్తుల సృష్టికి నిధులు తగ్గిస్తే దీర్ఘకాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. సంక్షేమంతో పాటు సంపద సృష్టిని కూడా సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం నెరవేరాలంటే, ఆదాయ మార్గాలను గణనీయంగా పెంచుకోవాలి. అటవీ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల వాటా, గ్రాంట్లపై రాష్ట్రం ఆశలు పెట్టుకుంది. కేంద్రంతో సఖ్యతగా ఉంటూనే నిధులు రాబట్టుకోవడం రాజకీయంగానూ, ఆర్థికంగానూ ఇప్పుడు అనివార్యం. ఈ బడ్జెట్ సమావేశాలు తెలంగాణ ఆర్థిక దిశను నిర్దేశించనున్నాయి.

కిషన్ రెడ్డి డిమాండ్ చేసినట్లుగా ప్రభుత్వం పారదర్శకంగా వివరాలు వెల్లడిస్తుందా? లేక రాజకీయ ఆరోపణలకే పరిమితమవుతుందా అన్నది చూడాలి. సంక్షేమ పథకాల అమలులో వేగం పెంచుతూనే, ఆర్థిక క్రమశిక్షణను పాటించడమే రేవంత్ సర్కార్ ముందున్న అసలైన పరీక్ష.

# హెచ్ బీ కాలనీలో ఎల్ఐజీ, ఎంఐజీలు

**హైదరాబాద్-సూర్య వాస్తవం:** పేద,మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం చేసే దిశగా తెలంగాణ సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. హైదరాబాద్ శివారులో ఎల్ఐజీ, ఎంఐజీ( వర్గాలకు తక్కువ ధరలకే ఇళ్లను కట్టించి ఇవ్వడానికి ప్రణాళికలు రచిస్తోంది. అందుకు కావాల్సిన స్థలాలపై తాజాగా హౌసింగ్ బోర్డు దృష్టిసారించింది. ఈనెల 25 నుంచి ఏప్రిల్ 4 వరకు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) పరిధిలోని హౌసింగ్ బోర్డు, దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ల్యాండ్ హోల్డింగ్స్ స్థలాలను గుర్తించి వాటికి రక్షణ గోడలను నిర్మించాలని డిసైడ్ అయింది.ఈ 11 రోజుల్లోనే ఆయా పేద, మధ్యతరగతి ప్రజలకు స్థల సేకరణ, ఇళ్ల నిర్మాణంపై డీపీఆర్ తయారీకి ప్రణాళిక రూపొందించనుంది. హౌసింగ్ బోర్డుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ సమస్యల పరిష్కారానికి ఏప్రిల్ 5 నుంచి 14 వరకు కేటాయింపుదారులతో కాలనీల వారీగా అధికారులు సమావేశాలను నిర్వహిస్తారు.

ఏప్రిల్ 15 నుంచి 23 వరకు గ్రీవెన్స్ కాల్ సెల్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఎఫర్డబుల్ హౌసింగ్ పాలసీని సిద్ధం చేస్తోంది. వీరికి కూడా సొంత ఇల్లు కొనుక్కోవాలనే కోరిక ఉన్నప్పటికీ.. అక్కడ కూడా ధరలు భారీగా పెరిగి పోవడంతో అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. అందుబాటు ధరలో ఇళ్లు, ఫ్లాట్ల ఉంటే వీరి సొంతింటి కలను నిజం చేసుకోవచ్చు.

ఈ మేరకు టైర్ -2 పట్టణాల్లోనూ ఇళ్ల టవర్లను ఏర్పాటుచేసేలా సర్కార్ మార్గదర్శకాలను రెడీ చేస్తోంది. కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గృహనిర్మాణశాఖ స్థలాలను ఇప్పటికే గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ఇళ్ల సముదాయాలు నిర్మించి అల్ప ఆదాయ, మధ్యతరగతి వారికి తక్కువ ధరలకే అందించాలని సర్కార్ ప్రయత్నాలు చేస్తోంది

# మహిళా న్యాయవాదులను సన్మానించిన ఐఏఎల్



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం మహిళా న్యాయవాదులను భారత న్యాయవాదుల సంఘం ఘనంగా సన్మానించింది. భారత న్యాయవాదుల సంఘం కడప అన్నమయ్య జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆనందకుమార్ ఆధ్వర్యంలో రాయచోటి బార్ అసోసియేషన్‌కి చెందిన మహిళా న్యాయవాదులైన లక్ష్మీదేవి, కృష్ణమ, వరలక్ష్మి, మాధవి, శివమ్మ , కైరున్ బి, మహబూబ్ జాన్, మక్బూల్ జాన్, ముకుందా ప్రియాలను ఘనంగా సన్మానించారు. న్యాయవాది థామస్ సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న వారిలో న్యాయవాదులు రాయచోటి బార్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డి భాష, మిఠాయిగిరి ఖాదర్బాషా నాగ ముని, హూ మై యున్ భాష జగదీష్ ఇర్షాద్ నాగేంద్ర శివకుమార్ మల్లికార్జున రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌పీవీ టీకా ప్రచార పోస్టర్ విడుదల

### - జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** గర్భాశయ క్యాన్సర్ నుండి కౌమారదశ బాలికలను రక్షించేందుకు ఆరోగ్య శాఖ చేపట్టిన హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిల్లోమావైరస్) టీకా ప్రచార పోస్టర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్ రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ... జిల్లాలో హెచ్‌పీవీ టీకా ప్రచార కార్యక్రమం కింద 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందజేస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ కుమార్తెలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఇతర ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు తీసుకువెళ్లి టీకా వేయించుకోవాలని కోరారు. భవిష్యత్తులో గర్భాశయ క్యాన్సర్‌ను నివారించడంలో హెచ్‌పీవీ టీకా సురక్షితమైనదిగా, ప్రభావవంతమైనదిగా ఆరోగ్యమని పేర్కొన్నారు. కౌమారదశలో ఉన్న బాలికల ఆరోగ్యాన్ని కాపాడటమే ఈ ప్రచార కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. అర్హత కలిగిన బాలికలు మరియు వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి టీకా పొందాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఉషశ్రీ, కలెక్టరేట్ ఏవోనాగభూషణం, మదనపల్లి, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి ఎమ్మార్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీటిని రక్షించుకుందాం

### - వైసీపీ, అఖిల పక్ష నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపిన ఉరవకొండ వైసీపీ ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి

**ఉరవకొండ - సూర్య వాస్తవం :** ఉరవకొండ వైసీపీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ...ఆర్డీటిని రక్షించుకుందాం ( సేవ్ ఆర్డీటి ) కార్యక్రమాన్ని ఉరవకొండ దద్దరిల్లేలా విజయవంతం చేసినందుకు వైసీపీ, అఖిలపక్ష నాయకులకు, కార్యకర్తలకు, విద్యార్థులకు, వివిధ సంఘాల నాయ కులకు, సామాన్య ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం పదవ తరగతి పరీక్షలు ఉన్నందునా ధర్నా చేసే స్థలం హైస్కూల్ దగ్గరగా ఉండడం వలన సుమారు మూడు గంటలు ఆలస్యంగా మొదలైనప్పటికీ ఎంతో ఉత్సా హంగా పాల్గొన్న ప్తతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై ప్రణయ్ రెడ్డి, లోకనాథరెడ్డి రుద్రానంద యాదవ్, బోయ నాగరాజు, అశోక్ వన్నూరుస్వామి, కూడేరు ధనుంజయ్య, వైసీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )